క్లుప్తంగా

నడిరోడ్డుపై విద్యుత్ స్తంభం



భిక్కనూరు : మండల కేంద్రం నుంచి గిద్ద దళిత వాడ కాలనీకి వెళ్లే దారిలో నడి రోడ్డుపై విద్యుత్ స్తంభం ఉంది. దీని వల్ల ద్విచక్ర వాహనదారులు చాలామంది ఈ స్తంభాన్ని ఢీకొన్ని గాయాలపాలయ్యారు. కాని ట్రాన్స్‌కో అధికారులకు చెప్పినప్పటికీ తొలగించట్లేదని స్థానికులు పేర్కొంటున్నారు. వెంటనే ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు స్పందించి స్తంభాన్ని వేరే చోటికి మార్చాలని డిమాండ్ చేస్తున్నారు.

రైతులు నష్టపోకుండా చూస్తాం



భిక్కనూరు : మండల కేంద్రంతో పాటు పెద్ద మల్లారెడ్డి గ్రామాల్లో వానల వల్ల తడిసిన ధాన్యాన్ని తహసీల్దార్ శివప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. రైతులు నష్టపోకుండా ఉన్నతాధికారులతో రైస్‌మిల్లుల యజమానులతో మాట్లాడుతానని ఆందోళన చెందవద్దని ఆయన రైతులకు సూచించారు.

వీవోఏలకు అవగాహన



రామారెడ్డి : సదాశివనగర్ మండల సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం వీవోఏల సమీక్ష సమావేశానికి డీపీఎం సుధాకర్ హాజరయ్యారు. ఐబీకి సంబంధించి అకౌంటింగ్, యాప్ గురించి, లోన్ ఎంట్రీ గురించి లాన్ ఇన్సూరెన్స్ తదితర అంశాలపై సమీక్షించారు. దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్ స్లాట్ బుకింగ్‌పై అవగాహన కల్పించారు.

అలుగు నిర్మాణానికి నిధులు



రామారెడ్డి : మండల కేంద్రంలోని రంగ చెరువు గతంలో అలుగు తెగిపోగా, రామారెడ్డి జెడ్పీటీసీ మోహన్ రెడ్డి నీటి పారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసులును శుక్రవారం కలిశారు. అలుగు నిర్మాణంకు నిధులు మంజూరు చేయాలని కోరారు. స్పందించిన అధికారులు అలుగు నిర్మాణంకు రూ. 4 లక్షల నిధులు మంజూరు చేశారని జెడ్పీటీసీ మోహన్‌రెడ్డి తెలిపారు. వర్షాకాలంలోపు అలుగు నిర్మాణ పనులను పూర్తి చేసి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చేస్తామన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



దోమకొండ : సైబర్ నేరాలపై ప్రజల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై గణేశ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కెనరా బ్యాంక్ కార్యాలయంలో బ్యాంకు సిబ్బందితో కలిసి ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఖాతాదారులు ఫోన్లకు వచ్చే ఓటీపీలను ఇతరులకు చెప్పవద్దన్నారు. బ్యాంకులతో పాటు ఏటీఎం కేంద్రాల వద్ద కార్డులను మార్చే సమయంలో ఏమాత్రం అలసత్వం చేయవద్దన్నారు. ఏఎస్సై సుబ్రహ్మణ్య చారి, కానిస్టేబుల్ భూమయ్య ప్రభాకర్, మహిళా కానిస్టేబుల్ సౌజన్య తదితరులున్నారు.

కొండాపూర్‌లో పీహెచ్‌సీ ఏర్పాటుకు కృషి చేస్తాం

రాజంపేట : మండలం కొండాపూర్ గ్రామంలో పీహెచ్‌సీ ఏర్పాటు కోసం కృషి చేస్తానని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ పేర్కొన్నారు. శుక్రవారం 'సాక్షి'తో మాట్లాడారు. ఎల్లారెడ్డి నియోజకవర్గ వర్గం పరిధిలోని 12 గ్రామాల పీహెచ్‌సీ హామీ త్వరలోనే నెరవేరుతుందన్నారు. ఇటీవలే ఉన్నతాధికారులతో మాట్లాడానని, అలాగే ఆర్గొండం, కొండాపూర్ డబుల్ రోడ్డు పనులు కోసం ప్రతిపాదనలు పంపామని త్వరలోనే పనులు ప్రారంభిస్తామని ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న కారణంగా పనులలో కొంత జాప్యం జరిగిందన్నారు. ఎన్నికల కోడ్ ముగియగానే పనులపై దృష్టి సారిస్తామని ఫారెస్ట్ రోడ్డు పనులు పెండింగ్ విషయంపై కూడా అధికారులతో చర్చించామన్నారు. కొండాపూర్ ఎల్లారెడ్డిపల్లి బ్రిడ్జి పనులు త్వరితగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్ తో చర్చించి త్వరలోనే పనులు పూర్తి చేసి రవాణా సౌకర్యం కల్పించేలా ఏర్పాటు చేస్తామన్నారు. వర్షాలకు ధాన్యం తడిసిన రైతుల ఎలాంటి ఆందోళన చెందవద్దన్నారు.

ఇళ్లల్లోకి నీళ్లొస్తున్నాయ్..

- గజ్యానాయక్ తండావాసుల అవస్థలు
- డ్రెయినేజీలు లేక ఇబ్బందులు
- ప్రజాప్రతినిధులకు విన్నవించినా నిర్లక్ష్యమే..



గజ్యానాయక్ తండా చౌరస్తాలో వర్షానికి ఇళ్లలోకి చేరిన నీరు (ఫైల్)

మాచారెడ్డి : డ్రెయినేజీ నిర్మించాలని మండలంలోని గజ్యా నాయక్ తండా చౌరస్తా వాసులు ముక్త కంఠంతో కోరుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట నుంచి కామారెడ్డి సిరిసిల్ల రహదారిని విస్తరించారు. మొత్తం రు 1.26కోట్లతో నాలుగు వరుసల రోడ్డున నిర్మించినప్పటికి డ్రెయినేజీ నిర్మించకుండా వదిలేశారు.

ఇటీవల కురిసిన భారీ వర్షానికి డ్రెయినేజీ లేక ఆ వరద నీరంతా రోడ్డు పక్కన ఉన్న ఇళ్లలోకి వచ్చి చేరింది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్డు నిర్మిస్తున్న సమయంలో స్థానికులు డ్రెయినేజీ నిర్మించకుండా రోడ్డెలా నిర్మిస్తారని వ్యతిరేకించారు. స్థానిక ప్రజాప్రతినిధులు రోడ్డు వేసిన అనంతరం నిర్మిస్తామని నచ్చజెప్పారు. రోడ్డు నిర్మించి ఏడాది కావొస్తున్న అధికారులు డ్రెయినేజీ ఊసెత్తడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం..

ఇటీవల కురిసిన భారీ వర్షానికి రోడ్డుపక్కన నిల్వడంతో అటుగా ఓ వృద్ధుడు కాలు జారి అందులో పడ్డట్లు స్థానికులు తెలిపారు. వారు వెంటనే రక్షించడంతో ప్రాణాపాయం తప్పిందన్నారు. స్థానికుడైన మాజీ మంత్రి, ప్రస్తుత ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ చొరవ తీసుకొని డ్రెయినేజీ నిర్మాణానికి కృషి చేయాలని కోరుతున్నారు.

డ్రెయినేజీ లేక ఇబ్బందులు..



రోడ్డు నిర్మించారు కానీ డ్రెయినేజీ నిర్మించలేదు. దాంతో నీళ్లు నిల్వ ఉండడం వల్ల దోమల బెడద అధికమవుతోంది. రోడ్డేసి ఏం లాభం లేకుండా పోయింది. అధికారులు స్పందించి డ్రెయినేజీ నిర్మించాలి.

– నర్సింగ్‌రావు, స్థానికుడు

గొడవలు పడాల్సి వస్తోంది..



మురుగు కాల్వలు లేక వాన పడ్డప్పుడు వరద నీరు వెళ్లేదారి లేక ఇరుగుపొరుగు గొడవలు పడాల్సి వస్తోంది. ఇప్పుడు మురుగు కాల్వలు నిర్మించకుంటే వచ్చే సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల్లో ఓట్లే వేయకుండా నిరసన తెలియజేస్తాం.

– సత్యం, స్థానికుడు

చిన్నారులను చూసైనా..



మా ఇంట్ల ముగ్గురు చిన్న చిన్న పిల్లలున్నారు. ఎప్పుడేం జరుగుతదో తెలువదు. దండం బెడతా జెర గా మోర్లు కట్టియ్యండ్రి. రోడ్డేసి నప్పుడే మోర్లు కట్టాలని ఎంత మొత్తుకున్నా ఎవరూ పట్టించుకోలే. ఇప్పటికైనా మోర్లు కట్టించాలే.

– లక్ష్మి, స్థానికురాలు

పారిశుధ్యం లోపంపై డీఎల్‌పీవో ఆగ్రహం



రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో నాగరాజు

బిచ్కుంద(జుక్కల్) : మండల కేంద్రంలో పారిశుధ్యం లోపించిందని, జీపీలో అధికారులు, సిబ్బంది అసలు పనిచేస్తున్నారా లేదా అంటూ బాన్సువాడ డీఎల్‌పీవో నాగరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో మాట్లాడుతూ కార్యదర్శి సమయపాలన పాటించడం లేదని గ్రామస్తులు డీపీవోను ఫిర్యాదు చేయడంతో ఆయన ఆదేశాల మేరకు డీఎల్‌పీవో శుక్రవారం గ్రామ పంచాయతీని సందర్శించి అటెండెన్స్ రికార్డులను పరిశీలించారు. కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్‌ను పారిశుధ్యంపై శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. పద్ధతి మార్చుకొని ప్రజలకు స్థానికంగా నివాసం ఉంటూ విధి నిర్వహణలో సమయపాలన పాటించాలని వెంటనే సమస్యలు పరిష్కరించాలని సిబ్బందికి ఆదేశించారు. కందర్‌పల్లి–బాన్సువాడ మెయిన్ రోడ్లపై మురికి నీరు వరదలా పారుతోందని వెంటనే సరిచేయాలని ఆయన ఆదేశించారు. చెత్తను ఎత్తడానికి అదనంగా ట్రాక్టర్ ట్రాలీ కావాలని కార్యదర్శి కోరడంతో జీపీలో మిగులు బడ్జెట్‌తో మినీట్రాలీ తీసుకోవాలని డీఎల్‌పీవో పేర్కొన్నారు.

బీఆర్ఎస్‌కు సాగుపై మాట్లాడే హక్కు లేదు



మాట్లాడుతున్న పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి

భిక్కనూరు : వ్యవసాయంపై బీఆర్ఎస్ నేతలకు మాట్లాడే హక్కు లేదని పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, భిక్కనూరు ఎంపీపీ జాంగారి గాలిరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భీంరెడ్డి అన్నారు. శుక్రవారం వారు భిక్కనూరులో మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు ప్రకృతి వైపరీత్యాలు జరిగితే ఒక్కపైసా ఇవ్వని బీఆర్ఎస్ ఈరోజు వరికి బోనస్ ఇవ్వాలని ధర్నాలు చేయడం సిగ్గుచేటన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు వడగండ్ల వానతో పంటలు నష్టపోయిన రైతులకు బ్యాంక్ ఖాతాల్లో జమ చేశాడన్నారు. కాంగ్రెస్ పార్టీ రైతుల పక్షపాత పార్టీ అని ఆగస్టు 15 లోపు రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తోందన్నారు. వర్షాకాలం నుంచి వరి పంటకు క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇప్పిస్తామన్నారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ నర్సింహరెడ్డి కాంగ్రెస్ సీనియర్ నేతలు తాటిపాముల లింబాద్రి, నీల అంజయ్య, జనార్దన్‌రెడ్డి ఉన్నారు.

హజ్ యాత్రికులకు సన్మానం



హజ్‌యాత్రికుడిని సన్మానిస్తున్న షేక్ అక్బర్

బాన్సువాడ రూరల్ : మండల కేంద్రంలోని పలు కాలనీల నుంచి హజ్ యాత్రకు వెళ్తున్న యాత్రికులను శుక్రవారం సోషల్ వర్కర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ అక్బర్ ఘనంగా సన్మానించారు. బాన్సువాడ పట్టణం నుంచి ఈఏడాది 20 మందికి పైగా హజ్‌యాత్రకు వెళ్తున్నారన్నారు. జమాతే ఇస్లామి హింద్ నాయకులు అబ్దుల్ హఫీజ్, జావిద్ హకీం, మోయిన్‌పటేల్ తదితరులున్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

నస్రుల్లాబాద్(బీర్కూర్) : బీర్కూర్ మండలంలోని ఆయా గ్రామాల్లో ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని ఎంపీపీ రఘు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో రివ్యూ నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించి ఉపాధి కూలీల సంఖ్య పెంచాలన్నారు. ఆరు నుండి ఎనిమిది గంటలు పని చేస్తే అధిక కూలి పడుతుందన్నారు. నీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. కాలనీల్లో గల పారిశుద్య లోపం లేకుండా చూడాలన్నారు. సూపరింటెండెంట్ భాను, ఎంపీడీవో, ఏపీవో, వివిధ గ్రామాల పంచాయతి కార్యదర్శులు ఉన్నారు.



కార్యకర్తకు అండగా బీఆర్ఎస్



బాన్సువాడ రూరల్ : ఆపదలో ఉన్న కార్యకర్తల కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని 3 కుటుంబాలకు రూ. 2 లక్షల చొప్పున చెక్కులు అందజేసి మాట్లాడారు. బోర్లం గ్రామానికి చెందిన జగ్గ లక్ష్మణ్, పొతంగల్ మండలం హంగర్గా ఫారంకు చెందిన కాంబ్లె దిలీప్‌కుమార్, వర్ని మండలం హుమ్నాపూర్‌కు చెందిన సట్ట గంగామణి ఇటీవల మృతి చెందారు. బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం ఉండి మృతి చెందటంతో వారికి ఇన్సూరెన్స్ మంజూరు చేయించామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింహులు, శ్రీనివాస్‌రెడ్డి, పర్వారెడ్డి, రాజేశ్వర్‌గౌడ్ తదితరులున్నారు.

నృసింహుని ఆలయంలో రాజభోగ నివేదనం



మాచారెడ్డి : మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం రాజభోగ నివేదన కార్యక్రమాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఉదయం తిరుప్పావై సేవా కాలం బాలభోగ నివేదన తీర్థ గోష్టి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈవో శ్రీధర్ రావు, అభివృద్ధి కమిటీ చైర్మన్ కమలాకర్ రెడ్డి, అర్చకులు, గ్రామస్తులు ఉన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థికసాయం



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలో గురువారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాద బాధితులకు ఎస్సెస్సీ బ్యాచ్ స్నేహ బృందం శుక్రవారం రూ. 40 వేల ఆర్థికసాయం అందజేశారు. బాధితుడు అనిల్‌కుమార్‌కు చెందిన ఇల్లు దగ్ధం కాగా, ఆయన ఎస్సెస్సీ బ్యాచ్ స్నేహితులు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మిత్రులు మోహన్‌గౌడ్, రాజశేఖర్, రేహన్, మహేష్, సందీప్ తదితరులున్నారు.

పాఠశాలలన్నింటినీ బాగుచేస్తాం

- అమ్మ ఆదర్శ పాఠశాలలను సందర్శించిన కలెక్టర్ జితేష్ వి పాటిల్
- మౌలిక వసతుల కల్పనకు చర్యలు
- పనులు ప్రారంభించాలని ఆదేశం



లింగంపేట బాలికల ఉన్నత పాఠశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

లింగంపేట(ఎల్లారెడ్డి) :రాబోయే వర్షాకాలంలో విద్యార్థులకు ఇబ్బంది కలుగకుండా పాఠశాలలను బాగు చేయిస్తున్నట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల, బాలికల ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం ఆయన సందర్శించారు. గురువారం జరిగిన విద్యాశాఖ సమీక్షలో బాలికల ఉన్నత పాఠశాల శిథిలావస్థకు చేరుకున్నట్లు మండల అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా ఆయన పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో అన్ని వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. మహిళ సంఘాల సభ్యులు జూన్ 10వ తేదీలోపు అన్ని పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. జిల్లాలో ఇప్పటికే ప్రతిపాదనలు పంపిన పాఠశాలలకు 25 శాతం నిధులు విడుదల చేసినట్లు కలెక్టర్ తెలిపారు. పనులు వేగంగా చేయాలని పంచాయతీ రాజ్ ఏఈ రాకేశ్, మహిళా సంఘాలు, ఐకేపీ సిబ్బంది, పాఠశాలల హెచ్‌ఎంలను సూచించారు. బాలికల ఉన్నత పాఠశాల మరమ్మతుల కోసం సుమారు రూ. 11 లక్షలు, టాయిలెట్స్ తాగునీటికి రూ. 4 లక్షల ఖర్చు అవుతున్నట్లు ప్రతిపాదనలు పంపనున్నట్లు ఏఈ రాకేశ్ తెలిపారు. మండల విద్యాధికారి రామస్వామి, హెచ్‌ఎం సూరయ్య, శో భారాణి, సీసీలు మేహర్, గంగారాం, సిబ్బంది పాల్గొన్నారు.

మరమ్మతులు త్వరగా చేయాలి

ఎల్లారెడ్డి : అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన మరమ్మతు పనులను పూర్తి చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. పాఠశాలలు ప్రారంభం అయ్యే లోగా పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు కార్యక్రమంలో ఎంఈఓ వెంకటేశం ఇరిగేషన్ డి వెంకటేశ్వర్లు ఏఈ సతీష్ రెడ్డి ఉన్నారు.

పెద్దకొడప్‌గల్‌లో..

పెద్దకొడప్‌గల్(జుక్కల్) : విఠల్‌వాడి గ్రామంలో ప్రాథమిక పాఠశాలను జూన్ నెలలోగా బాగు చేయిస్తామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని విఠల్ వాడి గ్రామంలో ప్రాథమిక పాఠశాలను ఆయన పరిశీలించారు. పురాతన స్కూల్ గదులను కూల్చేసి కొత్త భవనం నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి విద్యాశాఖ అధికారి దేవిసింగ్, ఏఈ చందు, పాఠశాల హెచ్‌ఎం గంగామణి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి





కామారెడ్డి గాంధీ గంజ్‌లో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో రంగనాథ్ పాటిల్, బిచ్కుందలో..

కామారెడ్డి రూరల్ : అకాల వర్షాలు పడుతున్నందున ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని ఆర్డీవో రంగనాథ్ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. శుక్రవారం కామారెడ్డి మండలం ఇస్రోజీవాడి, అడ్లూర్, కామారెడ్డి గాంధీగంజ్‌లో కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూకం వేసి సిద్ధంగా ఉంచిన ధాన్యం బస్తాలను వెంటనే తరలించాలని, ఇందుకు అవసరమైన లారీలను కేంద్రాలకు పంపాల్సిందిగా ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్‌ను ఆదేశి/ంచారు. మిల్లర్లు త్వరగా ధాన్యాన్ని దించుకోవాలని, అకాల వర్షాల నేపథ్యంలో వారం రోజుల్లోపు కొనుగోళ్ల ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ జనార్దన్, సివిల్ సప్లయ్ డీటీ కిష్టయ్య, సీఈవో మోహన్ రావు, మానిటరింగ్ అధికారులు సయ్యద్ ముసియోద్దిన్ తదితరులున్నారు.

బిచ్కుందలో..

బిచ్కుంద(జుక్కల్) : మండలంలోని పుల్కల్‌లో కొనసాగుతున్న వరి కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం తహసీల్దార్ సురేశ్ పరిశీలించారు. కేంద్ర నిర్వాహకులు సొసైటీ కార్యదర్శి సాయి ప్రకాష్, రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. తూకం వేసిన వెయ్యి బస్తాలు సిద్ధంగా ఉన్నా లారీలు లేక ఇబ్బందిగా ఉందని తహసీల్దార్‌కు తెలుపగా వెంటనే లారీ తెప్పించారు. బస్తాలు తడవకుండా పాలిథీన్ కవర్లు కప్పి జాగ్రత్తలు తీసుకోవాలని సొసైటీ అధికారులను ఆదేశించారు. రెండు రోజుల్లో మిగిలిన ధాన్యం మిల్లులకు వెళ్తుందని ఆందోళన చెందవద్దన్నారు.



తేమ శాతాన్ని పరిశీస్తున్న ఏఈవో స్వర్ణలత

నిజాంసాగర్(జుక్కల్) : నిజాంసాగర్, మహమ్మద్ నగర్ మండలాల్లోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం క్లస్టర్ ఏఈవోలు స్వర్ణలత, మధుసూదన్ పరిశీలించారు. ధాన్యం కొనుగోళ్లు, తేమ శాతాన్ని తనిఖీ చేశారు. ధాన్యం బస్తాల తరలింపునకు ధృవపత్రాలు ఇవ్వాలని వాటిని ట్యాబ్ చేయించి రెండు రోజుల్లో డబ్బు లు వచ్చేలా చేస్తామని రైతులకు వారు సూచించారు.

లారీల కొరతతో ధాన్యం రవాణాకు ఇబ్బందులు



భిక్కనూరులో రైతులతో మాట్లాడుతున్న విండో చైర్మన్ గంగళ్ల భూమయ్య

భిక్కనూరు : లారీల కొరతతో ధాన్యం రవాణాకు ఇబ్బందుకు ఇబ్బందులు కలుగుతున్నాయని భిక్కనూరు సింగిల్‌విండో చైర్మన్ గంగళ్ల భూమయ్య అన్నారు. శుక్రవారం ఆయన భిక్కనూరు మండల కేంద్రంలో తడిసిన ధాన్యం బస్తాలను ఆయన పరిశీలించారు. కాంటాలు జరిగి వారం పది రోజులవుతున్నా ధాన్యం మిల్లులకు తరలించకపోవడం వల్ల తాము వానల్లో బస్తాల వద్ద కాపాలా ఉంటున్నామని ధాన్యం బస్తాలు అన్నీ తడిసిపోయయాని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైస్ మిల్లుల యజమానులతో మాట్లాడుతానని తడిసిన ధాన్యంను ట్రాక్టర్లలో తరలించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట నాయకులు దుంపల మోహన్‌రెడ్డి, నర్మల రాంచంద్రం తదితరులు ఉన్నారు.

కొనుగోళ్లు త్వరగా పూర్తిచేయాలి



డీసీఎంఎస్ చైర్మన్‌తో మాట్లాడుతున్న రైతులు

బీబీపేట : వడ్లు కొనుగోలు కేంద్రాలకు తరలించి నెల రోజులు గడుస్తున్నా ప్రక్రియ ముందుకు సాగట్లేదని నిరసిస్తూ రైతులు మండల కేంద్రంలో శుక్రవారం డీసీఎంఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డితో వాగ్వాదానికి దిగారు. అకాల వర్షాల వల్ల వడ్లు పూర్తిగా తడుస్తున్నాయని లారీలు తెప్పించడంలో ఆలస్యం ఎందుకు అవుతుందని వారు ప్రశ్నించారు. ఇప్పటికైనా స్పందించి కొనుగోలు ప్రక్రియ వేగం అయ్యేలా చూడాలన్నారు. అధికారులతో మా ట్లాడి లారీలను తెప్పించే బాధ్యత తనదని, వారం రోజుల్లోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని ఇంద్రసేనారెడ్డి రైతులకు నచ్చజెప్పారు.

సంక్షిప్తం

నేడు బ్రహ్మంగారి ఆరాధన ఉత్సవాలు

నిజాంసాగర్(జుక్కల్) : నిజాంసాగర్ మండల కేంద్రంతో పాటు బూర్గుల్ గ్రామంలో శనివారం వీర బ్రహ్మేంద్ర స్వామి ఆరాధన ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. శనివారం బ్రహ్మంగారి ఆలయం వద్ద ఎడ్ల బండ్లు, బోనాల ప్రదర్శన ఉంటుందన్నారు. ఆదివారం మల్ల యోధుల కుస్తీపోటీలు నిర్వహిస్తున్నామన్నారు.

చేయూత ఫౌండేషన్ అధ్యక్షుడిగా సాయికుమార్



బాన్సువాడ రూరల్ : బాన్సువాడ పట్టణానికి చెందిన యువ చేయూత ఫౌండేషన్ నూతన అధ్యక్షుడిగా హిప్పర్గ సాయికుమార్‌ను నియమించినట్లు సంస్థ వ్యవస్థాపకులు వినోద్ శుక్రవారం ఒకప్రకటనలో తెలిపారు.

ఎల్లారెడ్డిలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలి

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డిలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలని పలువురు నాయకులు శుక్రవారం తహసీల్దార్ మహేందర్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఆధార్ కేంద్రం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, వీలైనంత త్వరగా ఏర్పాటు చేయాలని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘ నాయకులు లింగమయ్య సాయిబాబా తదితరులు ఉన్నారు.

నాణ్యమైన విత్తనాలను అందించాలి



నస్రుల్లాబాద్ (బీర్కూర్): రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలని మండల వ్యవసాయ అధికారిని కమల అన్నారు. శుక్రవారం మండలంలో గల ఎరువుల దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డు పుస్తకాలను పరిశీలన చేశారు. రైతులకు అందించే విత్తనాలు, మందులు నాసిరకంగా ఉంటే లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు.

నేడు కిరాణ షాపులు బంద్

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : తాడ్వాయి మండల కేంద్రంలో శనివారం కిరాణ షాపులు మూసి వేయనున్నట్లు ఆర్యవైశ్యం సంఘం సభ్యులు తెలిపారు. కన్యకాపరమేశ్వరి జయంతి సందర్భంగా కళశాల ఊరేగింపు నిర్వహిస్తున్నందున మండల కేంద్రంలోని దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేస్తున్నామన్నారు.

పెద్దమ్మకు బోనాలు



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని బోనాల్ గ్రామంలో శుక్రవారం ముదిరాజ్ కులస్తులు పెద్దమ్మకు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ముదిరాజ్ కులస్తులు ఇంటింటికీ బోనం తీశారు. అనంతరం పెద్దమ్మ ఆలయం చుట్టూ ఐదుసార్లు ప్రదక్షిణలు చేసి అమ్మవారికి బోనాలు సమర్పించారు. ముదిరాజ్ కులస్తులు. మహిళలు, పెద్దలు, యువకులు, పిల్లలు పాల్గొన్నారు.